13,14 తేదీల్లో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

సాక్షి,పాడేరు : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి ఈ నెల 13,14 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని జేసీ జె.శివ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 అమలు తీరును ఆయన పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. 12వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి అరకులోయ చేరుకుని రాత్రి బస చేస్తారని, మరుసటి రోజు 13వ తేదీన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అరకులోయలో బస చేస్తారని ఆయన తెలిపారు. 14న పాడేరు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, అదేరోజు విజయవాడకు బయలుదేరుతారని జేసీ పేర్కొన్నారు.

విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశానికి ఎంపీ మాధవి



కొయ్యూరు: ఢిల్లీలో జరిగే విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదివారం వెళ్లినట్టు ఎంపీ మీడియా ఇన్‌చార్జి రామ్ తెలిపారు. రెండు రోజుల పాటు ఆమె నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండరని తెలిపారు.

న్యూస్‌రీల్

నాసిరకం గుడ్ల సరఫరాకు చెక్



గుడ్ల తూకాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా కాకుండా ప్రభుత్వం చెక్ పెట్టింది. గుడ్లను తూకం వేసిన తరువాత యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో ఈనెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లను మెయిన్ గొడౌన్‌లో తూకం వేస్తున్నారు. అనంతరం ఆ వివరాలను మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపకల్పన చేసిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతే అంగన్‌వాడీ కేంద్రాలకు తరలిస్తున్నారు. గుడ్లకు రంగులను కూడా వేస్తున్నారు. దీనిపై సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ అక్టోబర్ నుంచి విధిగా తూకం వేసిన తరువాతే గుడ్లను కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. బియ్యాన్ని కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా వాహనంలో తరలిస్తున్నట్టు తెలిపారు.

వర్షాలకు కూలిన పాఠశాల భవనం



కూలిన పిరిబంద పాఠశాల భవనం

అరకులోయ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కూలిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో చిన్నారులు ఎవరూ పాఠశాలలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కూలిన భవనాన్ని సర్పంచ్ చిన్నబాబు పరిశీలించారు. పాత భవనం కావడంతో వర్షాలకు కూలిపోయిందని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి, నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ రవి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 108 వాహనంలో గర్భిణిని తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ కలబ్ గ్రామానికి చెందిన ఎస్.జాబిలమ్మ నిండు గర్భిణి. ఆమెకు శనివారం రాత్రి 11 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు కలబ్ గ్రామానికి వెళ్లి గర్భిణిని వాహనంలో తరలిస్తుండగా ముంచంగిపుట్టు మండలం వనభసింగి పంచాయతీ కొత్తూరు సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. ఆశా కార్యకర్త సహకారంతో 108 ఈఎంటీ రవి ప్రసవం చేశారు. పండంటి ఆడపిల్లకు జాబిలమ్మ జన్మనిచ్చింది. ఈఎంటీ రవి,పైలెట్ రమేష్ తల్లీబిడ్డలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

21 నుంచి సత్య దీక్షలు

అడ్డతీగల: అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి సత్య దీక్షలు ఈనెల 21 నుంచి ఆరంభించనున్నట్టు అడ్డతీగల పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆదివారం తెలిపారు. ఎప్పటివలే పవనగిరి కేంద్రంగా గిరిజనులతో సత్యదీక్షలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ దీక్షల విరమణ నవంబర్ 17న ఉంటుందన్నారు. దీక్షలు ప్రధానంగా 27 రోజులు, 18 రోజులు,9 రోజులు ఉంటాయని, స్త్రీ,పురుషులకు వీలైన విధంగా దీక్షలు చేపట్టవచ్చని తెలిపారు.18 రోజుల దీక్షను ఈనెల 30న, 9 రోజుల దీక్షను నవంబర్ 7న స్వీకరించాల్సి ఉందన్నారు. ఆసక్తి గల వారు కాకినాడ జిల్లా అన్నవరంలోని నవంబర్ 7వ తేదీ రాత్రి పంపా హారతులు కార్యక్రమం, జ్వాలాతోరణంలోనూ, 8న నిర్వహించే సత్యదేవుని గిరిప్రదక్షిణలో పాల్గొనవచ్చన్నారు. గిరిప్రదక్షిణ ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకే ఉంటుందన్నారు. నవంబర్ 16 న సత్యపడి పూజను అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో నిర్వహిస్తామని చెప్పారు. దీక్ష తీసుకునే భక్తులు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీని అందజేసి, పవనగిరి క్షేత్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

- విశాఖ పరిపాలన రాజధానితో గిరిజన ప్రాంతాల అభివృద్ధి
- మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకం
- మద్దతు తెలిపిన అఖిల పక్ష నేతలు
- అన్ని వర్గాల ప్రజలతో ఉద్యమం
- త్వరలో నాన్ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం

ఒకటే మాట.. అదే రాజబాట



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, చిత్రంలో అరకు,పాడేరు,రంపచోడవరం ఎమ్మెల్యేలు, జెడ్పీ,జీసీసీ చైర్‌పర్సన్‌లు, ట్రైకార్ చైర్మన్, అఖిలపక్ష నేతలు

సాక్షి, పాడేరు : అందరి **ఆకాంక్ష ఒక్కటే... ఆదే** పాలనా వికేంద్రీకరణ. **ఏజెన్సీతో పాటు అన్ని ప్రాంతాలు** సమగ్రంగా **అభివృద్ధి చెందాలంటే మూడు** రాజధానుల ఏర్పాటు **తప్పని సరి అని వక్తలు ముక్త** కంఠంతో నినదించారు. **విశాఖ పాలనా రాజధానికి** మద్దతుగా పోరాటాన్ని **ఉధృతంగా చేయాలని,** దీనిలో అన్ని వర్గాల **ప్రజలు పాల్గొనేలా చేయాలని** నిర్ణయించారు. వికేంద్రీకరణకు మద్దతుగా స్థానిక కాఫీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక, కుల సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా అభివృద్ధి సాధ్యమనే నమ్మకం తమకుందని నేతలంతా సంపూర్ణ మద్దతునిచ్చారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ గ్రూప్-1 అధికారి ఓండ్రు రామ్మూర్తి అధ్యక్షతన వికేంద్రీకరణకు మద్దతుగా ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వారు ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులే ముద్దు అని నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. విశాఖ పరిపాలన రాజధానితో వెనుకబడిన తమ ప్రాంతాల ప్రజలంతా అభివృద్ధి చెందుతారని, పరిశ్రమలుఏర్పడి ఉద్యోగాలు కూడా వస్తాయని గిరిజన ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రను ఉమ్మడి విశాఖ జిల్లాలో అడ్డుకోవాలని, వికేంద్రీకరణ, మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మూడు రాజధానులకు మద్దతుగా పోరాడేందుకు నాన్ పొలిటికల్ జేఏసీని త్వరలో ఏర్పాటు చేస్తామని, పార్టీలు, కులమతాలకతీతంగా ఉత్తరాంధ్ర, గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతునిస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటును మెజార్టీ ప్రజలంతా స్వాగతిస్తున్నప్పటికీ చంద్రబాబు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందితే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేసినవారిమవుతామని చెప్పారు. విశాఖలో పరిపాలన రాజధానికి అల్లూరి జిల్లాలోని అఖిలపక్ష నేతలంతా మద్దతునివ్వడం సంతోషంగా ఉందన్నారు. పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలు మాట్లాడుతూ రాజధానుల విషయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విశాఖ పరిపాలన రాజధాని కాకుండా అడ్డుకుంటే ఆ పాపం చంద్రబాబుకే తగులుతుందన్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్రతో పాటు గిరిజన ప్రాంతాలు అభివృద్ధి పరంగా వెనుకబడి ఉన్నాయన్నారు.రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని, గిరిజన ప్రాంతాలకు కూడా మేలు చేసే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారని వారు తెలిపారు. బాక్సైట్ అనుకూల జీవోలను రద్దు చేసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి గిరిజనుల పక్షపాతిగా పేరొందారని, అలాగే రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారని, నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను కూడా అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలను అందుబాటులో తెచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, వైఎస్సార్‌టీఎఫ్ నేత మత్స్యరాస మత్స్యరాజు, పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు పలాసి కృష్ణారావు, గండేరు చినసత్యం, కుర్తాడి రామారావు, ఎంపీపీలు ఎస్.రత్నకుమారి, బడుగు రమేష్, వైఎస్సార్ **సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబా**బు, మాజీ ఎం**పీపీలు ఎస్వీ రమణమూర్తి, మత్స్యరా**స వెంకట గంగ**రాజు, పాడేరు వర్తక సంఘం నేతలు** అనిల్, నాజర్‌వ**ల్లి, అల్లా, శ్రీనివాసరావు, కెజియారాణి**, నవర గోవిం**ద్, మన్య ప్రాంత విలేకరుల సంఘం** నేత కె.దుర్గా**ప్రసాద్, పలు మండలాల ఎంపీటీసీ** సభ్యులు, సర్పం**చులు, వైఎస్సార్‌సీపీ నాయకులు** పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం చరిత్రాత్మకం



మూడు రాజధానుల ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అంతటిని హైదరాబాద్‌కే పరిమితం చేయడంతో పలు ప్రాంతాలు వెనుకబాటుకు గురయ్యాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏపీకి తీవ్ర అన్యాయం జరిగింది. అందువల్ల మూడు రాజధానుల ఏర్పాటును స్వాగతిస్తున్నాం.
– మత్స్యరాస బాలరాజు, మాజీ మంత్రి

మూడు రాజధానులకు సంపూర్ణ మద్దతు



రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేందాలి. మూడు రాజధానుల ఏర్పాటుకు సంపూర్ణ మద్దతునిస్తున్నాం. శ్రీకృష్ణ, శివరామన్ కమిటీల నివేదికను కూడా సీఎం పరిగణలోకి తీసుకోవడం మంచి పరిణామం. తెలంగాణలోనూ మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని గాలి వినోద్‌కుమార్ ఆ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దేశ వ్యాప్తంగా కూడా రాజధానుల ఏర్పాటుపై ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. గిరిజన ప్రాంతాలు కూడా వికేంద్రీకరణతో అభివృద్ధి చెందుతాయి.
– సమరెడ్డి మాణిక్యం, దండకారణ్య విమోచన సమితి నేత

వికేంద్రీకరణ జరగాల్సిందే



వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయి. మెజార్టీ ప్రజలంతా మూడు రాజధానులకు మద్దతునిస్తున్నారు. అల్లూరి జిల్లాలోని ప్రజలు కూడా వికేంద్రీకరణ కచ్చితంగా జరగాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.
– సతక బుల్లిబాబు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్

గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యం



విశాఖను పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేసే నిర్ణయాన్ని గిరిజనులు స్వాగతిస్తున్నారు. పరిపాలన రాజధాని ఏర్పడితే గిరిజన ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి. అన్ని మౌలిక సదుపాయాలున్న విశాఖలోనే పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలి.
– డాక్టర్ శోభ స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి



విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్రలో పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పడి ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. ఉత్తరాంధ్ర ప్రజలంతా మూడు రాజధానులను కోరుకుంటున్నారు. గిరిజన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.
– జల్లిపల్లి సుభద్ర, జెడ్పీ చైర్‌పర్సన్

అందరూ మద్దతు ఇవ్వాలి



సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతోంది. నాడు-నేడుతో పాఠశాలలు అభివృద్ధి చేశారు. నవరత్నాల పథకాలతో ప్రజలకు మేలు జరుగుతోంది. మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎంకు అందరూ మద్దతునివ్వాలి.
– గిడ్డి వరలక్ష్మి, ఉపాధ్యాయురాలు, ఆదివాసీ మహిళా ఉద్యోగుల సంఘం నేత

భవిష్యత్ తరాలకు మేలు



రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయిలో మంచి నగరంగా అభివృద్ధి చేసినప్పటికీ రాష్ట్రం విడిపోయిన తర్వాత నష్టపోయాం. ఇదే పరిస్థితి భవిష్యత్‌లో జరగకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధికి నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం.
– లకే చిట్టిబాబు, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

ఉన్నత విద్యావకాశాలు



పరిపాలన రాజధానిగా విశాఖ ఏర్పడడం ద్వారా ఉన్నత విద్యావకాశాలు అందుబాటులోకి వస్తాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో బీఈడీ, డీఎడ్ కళాశాలలను తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత గిరిజన ప్రాంత అభ్యర్థులకు అన్యాయం జరిగింది. పరిపాలన రాజధాని ఏర్పడితే ఉన్నత విద్య మరింతగా అందుబాటులోకి వస్తుంది.
– రేగం సూర్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం

అమరావతి రైతుల పోరాటాన్ని తిప్పికొట్టాలి



రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తుంటే అమరావతి రైతులు తప్పుడు పోరాటాలు చేయడం దారుణం. అమరావతి రాజధానికి భూములిచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, అదంతా రియల్ ఎస్టేట్ దందా. అమరావతిలో రాజధాని ఏర్పడితే కొందరికే ప్రయోజనం. అమరావతి రైతుల పాదయాత్రను తిప్పికొట్టాలి.
– శెట్టి ప్రభుదాసు, హెచ్ఎంల సంఘం నేత

పార్టీలకతీతంగా..



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా వికేంద్రీకరణకు మద్దతు ఇవ్వాలి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలోనే ప్రజల కష్టాలన్నీ తెలుసుకున్నారు. సీఎం అవగానే నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మూడు రాజధానుల ఏర్పాటుతో కూడా ఏపీ సమగ్ర అభివృద్ధి చెందుతుంది.
– కిల్లు గంగన్నపడాల్, అఖిలపక్ష నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

సాయంత్రం 5.30 వరకే..

- వంజంగి హిల్స్‌పైకి వాహనాలకు అనుమతి
- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు : వంజంగి హిల్స్ సందర్శనకు వచ్చే పర్యాటకుల వాహనాలను సాయంత్రం 5.30గంటల వరకు మాత్రమే అనుమతించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. టూరిస్టుల మినీ బస్సు వంజంగి హిల్స్‌లో లోయలోకి బోల్తాకొట్టిన ప్రమాద సంఘటనపై కలెక్టర్ స్పందించారు. ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న పర్యాటకులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా వంజంగి హిల్స్‌పై ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీతో సమీక్షించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాయంత్రం 5.30గంటల నుంచి ఉదయం వరకు వంజంగి హిల్స్‌కు వాహనాల రాకపోకలపై నిషేధం అమలులో ఉంటుందని, పోలీసుల అనుమతితోనే పర్యాటకులు వాహనాలను వంజంగి హిల్స్‌కు తీసుకువెళ్లాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.టూరిస్టుల బస్సు బోల్తా సంఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ కలెక్టర్‌కు నివేదించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్ పాల్గొన్నారు.



వంజంగి ఘాట్‌రోడ్డులో ఎస్పీతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ఎల్‌టీటీ వీక్లీ

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికులకు మరింత సుఖవంతమైన, సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించే దిశగా వాల్తేర్ డివిజన్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా పలు రైళ్లకు పాత కోచ్‌ల స్థానంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను అంచెలంచెలుగా జతచేస్తోంది. పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన విశాఖపట్నం-ఎల్‌టీటీ (22847)(వయా రాయగడ) వీక్లీ (ప్రతీ ఆదివారం) ఎక్స్‌ప్రెస్‌ను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. తిరుగు ప్రయాణంలో ఎల్‌టీటీ-విశాఖపట్నం (22848) (వయా రాయగడ) వీక్లీ (ప్రతీ మంగళవారం) ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయల్దేరనుంది. ఈ రైలుతో కలిపి 13 జతల రైళ్లు పూర్తిస్థాయిలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో వాల్తేర్ డివిజన్ నడుపుతున్నట్లు డీఆర్ఎం తెలిపారు. ఈ రైలు మొత్తం 18 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తుందన్నారు.



ఎల్‌టీటీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

లోయలోకి దూసుకుపోయిన టూరిస్టు బస్సు



లోయలో పడిన బస్సు




పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

- ఇద్దరికి స్వల్ప గాయాలు
- పెద్ద ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న పర్యాటకులు

పాడేరు రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి హిల్స్‌కు వెళ్తున్న టూరిస్టు బస్సు లోయలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌరీ పార్వతి, పానీ అనే ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడ్డారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు విశాఖ నగరంలోని పాత జైలు రోడ్డు ప్రాంతానికి చెందిన 14 మంది రెండు రోజుల విహారయాత్రకు వచ్చారు. శనివారం అరకు అందాలను తిలకించి రాత్రికి అక్కడే ఉండి, ఆదివారం ఉదయం పాడేరు మండలంలో వంజంగి హిల్స్‌కు బయలుదేరారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు అంచులు బురదమయంగా మారాయి. ఆ బురద మీద నుంచి వెళ్లిన బస్సు జారి అదుపు తప్పి సమీపంలో ఉన్న లోయలో బోల్తా పడింది. గాయపడిన వారితో పాటు కోటేశ్వరరావు, లీలా, గోపి, శ్రీను, కనక, రాజేష్, రోహిణి, అప్పారావు తదితరులు బస్సులో ప్రయాణిస్తున్నారు. స్థానికులు సమాచారమివ్వడంతో పాడేరు నుంచి రెండు, జి.మాడుగుల నుంచి ఒక 108 వాహనం హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లాయి. బస్సులోంచి బాధితులను బయటకు తీసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో ఇద్దరికి మినహా మిగిలిన వారికి పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సన్‌మోహనం

- సూర్యోదయ అందాలు తిలకించి మైమరిచిన పర్యాటకులు
- జెండా కొండకు పోటెత్తిన సందర్శకులు



జెండా కొండ (సీతమ్మ పర్వతాలు) పైనుంచి సూర్యోదయాన్ని తిలకిస్తున్న పర్యటకులు

హుకుంపేట: ఏజెన్సీలో అత్యంత ఎత్తైన జెండా కొండను, ఆ కొండపై నుంచి సూర్యోదయాన్ని తిలకించిన పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. మండలంలోని తీగలవలస,తడిగిరి పంచాయతీలకు ఆనుకుని ఉన్న 5,526 అడుగుల ఎత్తు గల ఈ సీతమ్మ పర్వతం(జెండా కొండ) పైనుంచి ప్రకృతి రమణీయతను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

శనివారం సాయంత్రం ఓలుబెడ్డా గ్రామానికి చేరుకున్న పర్యాటకులు అక్కడ నుంచి కాలినడకన కొండపైకి వెళ్లి, గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేశారు. ఉదయం సూర్యోదయాన్ని, మంచు సోయగాలను చూసి మైమరిచిపోయారు. థింసా రాళ్లు, తేనేపట్టు గుహలను తిలకించారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గుహల అందాలను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. 3,574 మంది పర్యాటకులు తిలకించగా, రూ.2.79లక్షల ఆదాయం వచ్చినట్టు మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్, కటికి, తాటిగుడ, సరియా సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి.



పర్యాటకులతో సందడిగా ఉన్న బొర్రాగుహలు

చాపరాయి వద్ద ..

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని సందర్శించేందుకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కుటుంబ సమేతంగా వచ్చి జలకాలాడి, ఉల్లాసంగా గడిపారు.



చాపరాయి కిటకిట

క్లుప్తంగా

కాఫీ విత్తనాల పంపిణీకి చర్యలు



జయంత్ ఘోష్

చింతపల్లి రూరల్: ఏజెన్సీలో 2023 సీజన్‌లో కాఫీ నాట్లు వేసుకునేందుకు రైతులకు విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు పాడేరు కాఫీ బోర్డు ఉప సంచలకులు జయంత్ ఘోష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాఫీ విత్తనాలు కావల్సిన రైతులు చింతపల్లి, అరకులోయ, మినుములూరు కాఫీ బోర్డు విస్తరణ కార్యాలయాల్లో ఈ ఏడాది నవంబర్ 25 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కాఫీ విత్తనాలు కిలో రూ.400 చొప్పున కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఆర్.వి.నగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానంలో సెలక్షన్ 5ఎ, 5బి, 6, 8, 9, 11, 13(చంద్రగిరి), రొబస్టా రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన కాఫీ విత్తనాలు పొందాలని కోరారు.

జారిపడి గిరిజనుడి మృతి

అనంతగిరి: పశువులను కాసేందుకు వెళ్లి, జారిపడి ఓ గిరిజనుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ గ్రామానికి చెందిన సోమేల గంగులు(36)అనే గిరిజనుడు పశువులను గ్రామ సమీపంలోకి తీసుకెళ్లాడు. మందలోంచి ఓ పశువు ఈతమనువలస గ్రామం వైపుగా పరుగు తీస్తుండగా దానిని అదుపు చేసేందుకు వెళ్లిన గంగులు అదుపు తప్పి సీసీరోడ్డుపై జారిపడ్డాడు. తలపై తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు ఎస్.కోటలో ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టుగా తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల సాగు.. బహుబాగు

- జిల్లాలో 86,305 హెక్టార్లలో సాగు
- వాతావరణం అనుకూలం



రాజవొమ్మంగి పరిసరాల్లో పత్తి చేలు



రాజవొమ్మంగి పరిసరాల్లో పచ్చగా కళకళలాడుతున్న వరి పొలాలు

రాజవొమ్మంగి : అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో సాగు సజావుగా ముందుకు సాగుతోంది. వాతావరణం అనుకూలించడంతో పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది తొలకరి వర్షాలు సకాలంలో కురవడమేకాక వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో నీటి కొరత లేకుండా పోయింది. దీంతో కేవలం సాగునీటి వనరుల కింద మాత్రమే కాకుండా వర్షాధారంగా కూడా ఈ ఏడాది వివిధ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 86,305 హెక్టార్లలో (దాదాపు 2లక్షల15వేల762 ఎకరాల్లో) వివిధ పంటలు సాగవుతున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్ తెలిపారు. వరినాట్లు పూర్తయి నేటికి 75 రోజులు గడుస్తుండగా మరో 40 రోజుల్లో పంట చేతికి రానున్నట్టు చెప్పారు.

ముందస్తుగా విత్తనాల సరఫరా

ప్రభుత్వం ముందస్తుగా విత్తనాలు పంపిణీ చేయడంతో సీజన్‌కు ముందుగా రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. ఎంటీయూ–1064 (అమర), 1061–(ఇంద్ర) 1121–(శ్రీధృతి), 7029–(స్వర్ణ) తదితర దీర్ఘకాలిక వరి వంగడాలను ప్రభుత్వం 90శాతం రాయితీపై రైతులకు సరఫరా చేసింది.



మొక్కజొన్న పంట

నారుమడి పెంచిన రోజులు కలుపుకొని ఈ వంగడాలు 140 రోజుల్లో కోతకు వచ్చే అవకాశాలున్నాయి. తెగుళ్ల లేకుండా వరి ఏపుగా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. పత్తి, మొక్కజొన్న, రాగి తదితర మెట్ట పంటలకు కూడా వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు రావచ్చని రైతులు అభిప్రాయపడుతున్నట్టు డీఏవో నంద్ చెబుతున్నారు.

జిల్లాలో వివిధ పంటల సాగు (హెక్టార్లలో)

పంట	విస్తీర్ణం	ప్రస్తుత దశ
వరి	53,871	చిరుపొట్ట దశ
జొన్న	30	పంటకోత
సజ్జలు	88	,,
మొక్కజొన్న	1,833	,,
రాగులు	13,922	,,
కొర్రలు	64	,,
సామలు	1,753	,,
కంది	543	పూతదశ
పెసర	34	,,
మినుములు	336	,,
వేరుశనగ	2,726	మొలక దశ
నువ్వులు	10	పూత దశ
పత్తి	2,627	పూత-పిందె దశ
మిరప	78	,,
చెరకు	35	మధ్యస్థ దశ
పొగాకు	96	,,
పసుపు	8,244	పూత దశ

టీడీపీ కనుమరుగు కావడం తథ్యం



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులకు పార్టీ కండువా వేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, పాలనకు ఆకర్షితులై టీడీపీకి చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ కనుమరగై, భూస్థాపితమవుతుందన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ నేపథ్యంలో తాడిపుట్టు పంచాయతీకి చెందిన టీడీపి నాయకుడు, వైస్ సర్పంచ్ సీదరి శోభన్‌బాబుతో పాటు నిమ్మలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రేగం నారాయణరాజు, భీమరాజుతో పాటు పలువురు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తూ గిరిజనులకు అండగా నిలుస్తోందని, ఏజెన్సీలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరామని స్పష్టం చేశారు. పార్టీ మరింత బలోపేతం కోసం తామంతా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలో టీడీపీతో పాటు ప్రతిపక్ష పార్టీలన్నీ కనుమరుగవడం తథ్యమన్నారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకే పూర్తి మద్దతు తెలియజేస్తున్నారన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు వెంకటపూర్ణిమ, బొంజుబాబు, నాయకులు బి.బొంజుబాబు, ఎ.బొంజుబాబు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం



అడ్డతీగలలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



వేటమామిడిలో వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాఘవ తదితరులు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: వాల్మీకి జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు.మహాకవి వాల్మీకి జయంతి వేడుకను అడ్డతీగలలో వాల్మీకి సంఘం ప్రతినిధులు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తొలిత వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ శ్రీరాముని దివ్యచరిత్రను అందించిన వాల్మీకి జీవితం మనకందరికి స్ఫూర్తిదాయకమన్నారు. రాజ్యాంగం ద్వారా అందే ప్రతిఫలాలను వాల్మీకులకు అందిస్తామని ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు. అర్హులైన వారికి వాల్మీకి కులధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు. వాల్మీకులకు సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వాల్మీకి సంఘం అడ్డతీగల మండల కన్వీనర్ రమేష్‌బాబు, అధ్యక్షుడు ప్రభాకరరావు,అడ్డతీగల సర్పంచ్ చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేటమామిడిలో...

అడ్డతీగల మండలం వేటమామిడిలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని వాల్మీకి సంఘం పెద్దలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడి రోడ్ల కూడలిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంపీపీ బొడ్డపాటు రాఘవ, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు చిన్ననారాయణరావు,ఆ దివాసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరిస్తా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న శాలివాహనుల(కుమ్మరుల) కమ్యూనిటీ భవన నిర్మాణానికి తనవంతుగా పూర్తి సహాయ సహకారాలందిస్తానని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హామీ ఇచ్చారు. డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ అధ్యక్షతన ఆదివారం కొత్తకోట గ్రామంలో శాలివాహనుల సంఘం జిల్లా స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాలివాహనులు రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. ముందుకు వస్తే తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. నియోజకవర్గంలో వారి కోరిక మేరకు స్థలం కేటాయించి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీ కుమ్మరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దేవవరపు అర్జున, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ మాట్లాడుతూ కుమ్మరులు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం సముచిత స్థానంతోపాటు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, సర్పంచ్ కోన లోవరాజు, ఎంపీటీసీ పూడి దేవ, శాలివాహనుల సంఘం నాయకులు మల్లి చిరంజీవి, మల్లి సాంబమూరి, కృష్ణ, పెంటయ్య పాల్గొన్నారు.

టెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు ఘన సత్కారం



టెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రవిశంకర్‌ను సత్కరిస్తున్న అంబేడ్కర్ యూత్ సంఘం సభ్యులు

దేవరాపల్లి: టెట్ (టీచర్ ఎలిజిబులిటి టెస్ట్)లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన కాటపల్లి రవిశంకర్‌ను అంబేడ్కర్ యూత్ సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ స్ఫూర్తితో మరిన్ని ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలవాలని యూత్ సంఘం అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు, సభ్యులు ఆకాంక్షించారు. అనంతరం రవి శంకర్‌కు మహనీయుల చరిత్ర పుస్తకాలు అందజేశారు. ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కంచిమాలి అప్పారావు, సబ్బవరపు మాలిబాబు, ఉల్లి దేముళ్లు, కాటపల్లి అప్పారావు, సబ్బవరపు శివశంకర్ పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్య ప్రవేశాలకు 25 వరకు గడువు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ, జీజీ డిప్లమా, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందని కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వివరాలను www.andhrauniversityedu.in/rde వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. కార్యాలయ పనివేళల్లో 0891 2754966, 2844142, 2844143 నంబర్లలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

మానసిక రోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఎంతో మంది మానసిక రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు సూపరింటిండెంట్ డాక్టర్ హరికృష్ణ లేఖ రాశారు. మానసిక రోగుల కోసం 1860లో స్థాపించిన ఈ ఆస్పత్రి అంచెలంచెలుగా విస్తరించారు. 1950లో ఈ ఆస్పత్రిని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా 300 పడకల బోధనా ఆస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతి రోజు ఆస్పత్రి ఓపీకి రెండు వందల నుంచి 300 మంది వరకు రోగులు వస్తుంటారు. రెండు తెలుగురాష్ట్రాల్లో హైదరాబాద్‌లో ఎర్రగెడ్డ, విశాఖ ఆస్పత్రి మాత్రమే మానసిక రోగులకు వైద్యం అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మానసిక సంరక్షణ ఆస్పత్రిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టులో ఎంపానల్మెంటు చేయాలని హరికృష్ణ లేఖలో కోరారు.

విశాఖలో 'బనారస్' యూనిట్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన బనారస్ చిత్రం వచ్చే నెల 4న విడుదల చేయనున్నామని, ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో జైయిద్ ఖాన్, హీరోయిన్ సోనల్ కోరారు. ఆదివారం చిత్ర యూనిట్ సాగరతీరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బనారస్ చిత్రం ట్రైలర్‌కు అన్ని భాషల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రేమ, ఎమోషనల్, కామెడీతో కూడిన సన్నివేశాలు ఈ చిత్రంలో అద్భుతంగా అలరిస్తాయన్నారు. కుటుంబ సమేతంగా చూడదగిన మంచి చిత్రమన్నారు. విశాఖ తీరం ఎంతో అందంగా ఉందన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- ఆశవానిపాలెంలో ఘటన
- నాగేంద్రను రూ.5లక్షలకు అమ్మేసిన తల్లి?



మంగమ్మ మృతదేహం



మంగమ్మ(ఫైల్)

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): భర్త, అత్త వేధింపులు తాళలేక ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఆశవాని పాలెంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం ఆర్.రామచంద్రాపురానికి చెందిన గేదెల గోపి తన కుటుంబంతో గతంలో ఆశవానిపాలెంలో నివాసం ఉన్నారు. ఆ సమయంలో వీరి ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్న నాగేంద్ర కుమార్‌ను అతని కుమార్తె మంగమ్మ(31) ప్రేమ వివాహం చేసుకుంది. నాగేంద్ర డాక్‌యార్డులో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి పాన్‌షాప్ కూడా ఉంది. వీరికి ఇద్దరు పిల్లలు. పెళ్లయిన తర్వాత గోపి తన కుమార్తెకు ఇంటిని అప్పగించి సొంతూరు వెళ్లిపోయారు. కాగా.. పెళ్లయిన నాటి నుంచి మంగమ్మను అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నారు. తల్లి నాగమణి, సోదరితో కలసి నాగేంద్ర ఆమెకు చిత్రహింసలు పెడుతున్నాడు. ఇటీవల వీరి పాన్‌షాప్ వద్ద మంగమ్మను నాగేంద్ర, నాగమణి తీవ్రంగా కొట్టారు. దీంతో ఆమె తండ్రి వద్దకు వెళ్లి.. తన బాధను చెప్పుకుంది. భర్త, అత్త, ఆడపడుచు వెళ్లి ఆమెను మళ్లీ ఆశవానిపాలెం తీసుకొచ్చారు. తన కుమార్తెతో తండ్రి కూడా వచ్చారు. కాగా.. పెళ్లి సమయంలో గోపి తన కుమార్తెకు ఇచ్చిన ఇళ్లు పాడైందని కొద్ది కాలంగా మంగమ్మ తన కుటుంబంతో కలిసి ఆడపడుచు ఇంట్లో నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం పాతింట్లో నిద్రించిన గోపి టీ తాగేందుకు బయటకు వచ్చారు. కుమార్తె కోసం నాగేంద్ర సోదరి ఇంటికి వెళ్లారు. అక్కడ లేకపోవడంతో పాన్‌షాప్ వద్ద వెతికారు. అక్కడా లేకపోవడంతో పాత ఇంటికి చేరుకున్నారు. తలుపులు వేసి ఉండటంతో అనుమానం వచ్చి స్థానికుల సహకారంతో వాటిని తెరిచారు. ఇంట్లో ఉరి వేసుకున్న మంగమ్మను చూసి షాక్‌కు గురయ్యారు. తన కుమార్తె మృతికి ఆమె భర్త, అత్త, ఆడపడుచు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారంతో ఎయిర్‌పోర్టు ఎస్‌ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె శరీరంపై గాయాలు గుర్తించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేపట్టారు. కాగా.. కొంతకాలంగా ఓ యువతితో నాగేంద్ర అక్రమ సంబంధం నడుపుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. లోపాయికారిగా ఆమెతో ఆర్థిక ఒప్పందం చేసుకుని.. ఆమె నుంచి నాగమణి రూ.5లక్షలు తీసుకుందని చెబుతున్నారు. ఈ ఒప్పందం వల్లే మంగమ్మను వదిలించుకోవాలని తీవ్రంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

అల్లిపురం (విశాఖ దక్షిణం): విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సమస్య పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి 31వ తేదీ రకు దేశ వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణమూర్తి, ఎస్ఎస్ఎస్ రెడ్డి, జీవీ కృష్ణారావులు తెలిపారు. అఖిల భారత ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం నగరంలో ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ అప్‌డేట్ చేయాలని, కుటుంబ పెన్షన్ అప్‌డేట్ చేసి పూర్తిగా చెల్లించాలని, ముఖ్య నగరాల్లో ఆరోగ్య సంబంధిత సదుపాయాలు కల్పించాలని తదితర డిమాండ్లతో కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనియన్ బ్యాంక్ డీజీఎం కె.నాగరాజ్ మాట్లాడుతూ సీతమ్మధార యూబీసీ, రీజినల్ కార్యాలయం వద్ద ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగుల కోసం త్వరలో మెడిక్లినిక్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జోనల్ నాయకులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, జె.కేశవరావు, ఎంఎస్ భాస్కరరావు, కె.కోటేశ్వరరావు, శ్రీశ్రీ, రవికుమార్, బి.బాబుజీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటి పంటతో ఆదాయం

- కూరగాయల సాగుపై గిరిజన మహిళల ఆశక్తి
- సేంద్రియ ఎరువులతో సుస్థిర వ్యవసాయం
- ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం



చింతూరు ప్రధాన కూడలిలో కూరగాయలు, ఆకుకూరలను విక్రయిస్తున్న గిరిజన మహిళలు



కూరగాయలను కోస్తున్న మహిళలు



సాగులో ఉన్న చిక్కుడు పంట

చింతూరు: ఇంటి పంటలను తమ ఆర్థిక ఆదాయ వనరుగా మార్చుకున్నారు గిరిజన మహిళలు. ఇంటి పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని విక్రయించడం ద్వారా ఆర్థికాదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఏజన్సీలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాల్లో గిరిజన మహిళలు ఇంటి పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు ఏడాది పొడవునా పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, కషాయాలు వినియోగించి పండిస్తున్న వీటికి మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీంతో చాలా మంది మహిళలు ఇంటి పంటలపై ఆశక్తి చూపుతున్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు లభ్యమవుతుండడంతో వినిగయోగదారులు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంటిపంటల ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

సాగు ఇలా...

ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి దుక్కి దున్ని కూరగాయల సాగుకు అనుకూలంగా మలుస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను కొనుగోలు చేసి వాటిని చల్లుతున్నారు. ఇళ్లలోని మోటార్లు, చేతి బోర్ల సాయంతో తడులు పెడుతూ నీటిఎద్దడి లేకుండా చూస్తున్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు, పురుగు మందులకు బదులు కషాయాలను వినియోగిస్తున్నారు. ఇంటిల్లిపాది కలసి సేద్యం చేస్తూ కూరగాయలు, ఆకుకూరలు మంచిగా పండేలా కష్టపడుతున్నారు. పంటను పశువులు పాడు చేయకుండా చుట్టూ కంచె నిర్మిస్తున్నారు. ప్రధానంగా కూరగాయల్లో ఆనప, వంకాయ, బెండ, బీరకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు, టమాటా, కాకర, బరబాటి వంటివి పండిస్తున్నారు. ఆకుకూరల్లో తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, పుదీనా వంటివి పండిస్తున్నారు. నాలుగు మండలాల్లో సుమారు వంద మంది మహిళలు గత ఆరేళ్లుగా సుమారు 250 ఎకరాల్లో కూరగాయలను పండిస్తూ ఆర్థికాదాయం పొందుతున్నారు.

మండల కేంద్రాల్లో విక్రయాలు

గిరిజన మహిళలు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను మండల కేంద్రాలకు తీసుకొచ్చి ప్రధాన కూడళ్లలో విక్రయిస్తున్నారు. కూరగాయలను పోగులుగా, ఆకుకూరలను కట్టలుగా కట్టి పోగు రూ.20కి, కట్ట రూ.5 లేదా రూ.10కి విక్రయిస్తున్నారు. ఉదయమే తాజా కూరగాయలు సరసమైన ధరలకు లభ్యమవుతుండడంతో వినియోగదారులు అధికశాతం కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ప్రధాన సెంటర్లో బస్సులు నిలిపే ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలు లభిస్తుండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వాహనదారులతో పాటు ప్రయాణికులు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఎంతో తాజాగా వండిన పిదప రుచికరంగా ఉంటున్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. తక్కువ ఖర్చుతో ఇంటి వ్యవసాయం చేపట్టి గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా పాస్టర్ల దినోత్సవం



పాస్టర్ మాణిక్యం దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

అరకులోయ రూరల్: కొత్తభల్లుగుడ, పెద లబుడు, బొండగుడ గ్రామాల్లోని ఆదివారం హెచ్‌జేసీఎం చర్చిల్లో హార్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు బారికి మాణిక్యం, జ్ఞానమ్మ దంపతుల ఆధ్వర్యంలో పాస్టర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ దైవమార్గం అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం పాస్టర్ దంపతులను ఘనంగా సత్కరించారు. శాంతి, ధర్మ, డానియేల్, రూతు, లుదియ్య తదితరులు పాల్గొన్నారు.

మానసదేవికి ప్రత్యేక పూజలు



మానసదేవి అమ్మవారు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో వేంచేసిన మానసదేవికి ఆదివారం ఆశ్వ యుజ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి నిరాజన మంత్ర పుష్పాలతో పూజాధికాలు జరిపారు. నిమ్మలపాలెం, మర్రివీడుతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.వివిధ పిండి వంటలతో అమ్మవారికి నివేదన సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాజవొమ్మంగి: మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ వేడుకను ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక రెహమానియా మసీదులో జరిగిన వేడుకలో ఇమామ్‌లు(మత గురువులు) మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయమన్నారు. ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకమని, అనుసరించాలని ప్రవచించారు. అనంతరం ఫాతెహా కార్యక్రమం జరిగింది. మసీదు కమిటీ సభ్యులు షేక్ బాజి, షేక్ అలి, దావూద్, షేక్ సుల్తాన్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆర్‌వీ నగర్‌లో కూలిన ఇల్లు



కూలిన ఇంటి ముందు బాధితురాలు

గూడెంకొత్తవీధి: గడచిన కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్‌వీ నగర్‌లో ఓ ఇల్లు ఆదివారం కూలిపోయింది. బాధితురాలు నెక్కల సావిత్రి తన సొంతింట్లో నివాసముంటున్నారు. ఎడతెరిపి లేని వర్షాల మూలంగా ఇంటి కొంత భాగం కూలిపోయిందని, తలదాచుకునేందుకు అవకాశం లేదని బాధితురాలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: వెదురునగరం గ్రామంలోని సాయిరాం ఆశ్రమ దేవాలయాల ప్రాంగణంలో ఆదివారం ఆశ్వయుజ పౌర్ణమి పురస్కరించుకొని ఆశ్రమ నిర్వాహకులు సాయిరాం గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన రేణుకాలమ్మ మహంకాళీ అమ్మవారి దేవాలయ గిరిజన ప్రధాన అర్చకులు ముర్ల రాజారెడ్డి, వేదపండుతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



రంపచోడవరంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



బోడులూరులో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



వై.రామవరంలో వాల్మీకీ జయంతి వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు



కిండ్ర గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలో పాల్గొన్న ఎంపీపీ వెంకటలక్ష్మి తదితరులు

రంపచోడవరం : వాల్మీకి మహర్షి జయంతిని రంపచోడవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి పేటలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వాల్మీకి సంఘం నాయకుడు గొర్లె చిన్న నారాయణరావు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం మానవాళికి మార్గదర్శకమన్నారు. రామయణాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజనులందరూ కలిసికట్టుగా గిరిజన ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలన్నారు. నిరంజనీదేవి, భూచక్రం, భవానీ శంకర్, హేమన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో

బోదులూరు సెంటర్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, సర్పంచ్ జాకబ్, మాజీ ఎంపీటీసీ అనిల్ ప్రసాద్ (బాబీ), నాయకులుప్రణీత్, డీఎస్‌కే తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. కింద్ర గ్రామంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతు వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రాజు, సర్పంచ్ సత్యనారాయణ, వాల్మీకి సంఘం నాయకుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి వాల్మీకి నగర్‌లో గిరిజన ప్రతిభ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పారావు, రాజమోహన్, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు. జడ్డంగి వాల్మీకి నగర్‌లో, వాతంగి, వంచంగి తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

వై.రామవరం: మండల కేంద్రంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతు వాల్మీకి జీవిత చరిత్రను వివరించారు. త్రిమూర్తులు, శ్రీకాంత్, శివరామ్, రాజబాబు, ప్రకాశం , తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి దారితో అవస్థలు



రాజవొమ్మంగి - అప్పలరాజుపేటకు దారి దుస్థితి

రాజవొమ్మంగి: మండల కేంద్రం నుంచి అప్పలరాజుపేట గ్రామానికి సరైన రహదారి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి బురదమయంగా ఉండడంతో చినుకు పడితే రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి తదితర ఐదు గ్రామాల ప్రజలు వయా అప్పలరాజుపేట మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. రహదారి అభివృద్ధి చెందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి రహదారి బాగు చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై రంపచోడవరం గిరిజన సంక్షేమ అసిస్టెంట్ ఇంజినీర్ వీరభద్రరావు మాట్లాడుతూ రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వెళ్లే రహదారి కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు కల్పించాలి



మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నబాబు

అరకులోయ రూరల్: ఏజెన్సీలో కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కాఫీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నబాబు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 80 శాతం మంది రైతులు కాఫీ సాగుపై ఆధారపడి ఉన్నారన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో మ్యాక్స్ బోర్డు పేరుతో కాఫీ కొనుగోలు చేస్తోందని, అధికారుల పర్యవేక్షణ లేక గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నట్టు ఆరోపించారు. ఐటీడీఏ కిలో కాఫీ పండ్లు రూ.36 ప్రకటించడంతో రైతులు నష్టపోతున్నారని, ధరను పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు. బుజ్జిబాబు, రమేష్ తదితరులున్నారు.

చిన్నారి కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



చిన్నారి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లి: గొతులో పడి మృతి చెందిన చిన్నారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న చెండ జీవిత(9) శనివారం సాయంత్రం ఈకో పల్పింగ్ యూనిట్ భవన నిర్మాణ గోతులో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ఎంపీపీ అనూషదేవి ఆదివారం కలిసి పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వలి తదితరులున్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: చవిటిదిబ్బలు గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. ఈ కార్యక్రమానికి గ్రామపెద్దలు, యువత, పలువురు ప్రముఖులు సహకారం అందించినట్టు తెలిపారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలోని సోమవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటున్నట్టు ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రాయపల్లి పంచాయతీలో..

అడ్డతీగల: రాయపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రత్నరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయపల్లి, చిన్నవడిశకర్ర, వెదురునగరం గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రేపు పనసలపాలెంలో...

వై.రామవరం: పనసలపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



లకే నానీ పాత్రుడు

పాడేరు రూరల్ : అల్లూరి జిల్లా పరిధిలోని 22 మండలాల్లో పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నానీ పాత్రుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు పట్టభద్రుల ఓటు హక్కు లేని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులంతా సమీపంలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో ఫారమ్-18 ద్వారా తమ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

వర్షాలతో రహదారుల కోత



వర్షాలకు కోతకు గురైన చల్లగెడ్డ గంగవరం రోడ్డు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకొట, కివర్ల పంచాయతీలకు చెందిన పలు గ్రామాల రహదారులు కురుస్తున్న వర్షాలకు కోతకు గురైయ్యాయి. చల్లగెడ్డ నుంచి బొర్రాపాలెం, చీడిమెట్ట, చటకంభ, పుతికపుట్టు, జగడలమామిడి, తంగేళ్లబందలను గ్రామాలను కలుపుకుంటూ గంగవరం గ్రామం వరకు జరుగుతున్న రహదారి కోతకు గురైంది.బొర్రాపాలెం, జగడలమామిడి వద్ద కల్వర్టు ఏర్పాటు చేయకపోవడంతో గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రహదారి, సామగ్రి కొట్టుకుపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గెడ్డలు, వాగులు ప్రవహించే ప్రదేశాల్లో కల్వర్టు నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

రాజేంద్రపాలెంలో పొంచి ఉన్న ప్రమాదం



రాజేంద్రపాలెంలో ప్రధాన మార్గంలో గోయి

కొయ్యూరు: కొయ్యూరు-కాకరపాడు రహదారిని కొత్తగా వేసేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా రూ.90 లక్షలతో ప్రతిపాదించారు. ఆర్ అండ్‌బీ అధికారులు నిధులు విడుదల చేస్తే పనులు ప్రారంభమవుతాయి. సుమారు ఎనిమిది సంవత్సరాల కిందట కాకరపాడు-కొయ్యూరు రహదారి వేశారు. ఏటా వర్షాలు భారీగా కురవడంతో రహదారి పాడైంది. కాకరపాడు నుంచి రహదారి పూర్తిగా పాడైంది. సింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజేంద్రపాలెంలో రోడ్డు పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఇక్కడ గతంలో నీరు నిల్వ ఉండేది కాదు. గడచిన కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డుకు ఇరువైపులా గృహాల ఏర్పాటులో రహదారి ఎత్తును పెంచుకోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దాదాపుగా రెండు ఫర్లాంగుల దూరం మేరకు రోడ్డుకు రెండు వైపులా ఎత్తు పెరిగిపోవడంతో నీరు ముందుకు సాగడం లేదంటున్నారు. దీంతో రాజేంద్రపాలెంలో పెద్ద గొయ్యి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. దీంతో వర్షాలు కురిసినపుడు వాహనచోదకులు గోతిలో పడి గాయాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్‌బీ ఇన్‌చార్జి జేఈ ప్రసాద్ మాట్లాడుతూ పాడైన కాకరపాడు-కొయ్యూరు రహదారిని ఇటీవల పరిశీలించామన్నారు. పనుల అంచనాకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతారన్నారు. రాజేంద్రపాలెంలో పెద్ద గొయ్యి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు పనుల కోసం ఎంపీపీ రమేష్ కూడా ఉన్నతాధికారులతో మాట్లాడరని చెప్పారు. పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరతున్నారు.

వర్షాకాలం.. సాగులో అప్రమత్తం

- సాగునీటి వినియోగంపై సమతుల్యం అవసరం
- వ్యవసాయశాఖ అధికారులు సూచనలు



సీసాగుడ గ్రామంలోని సాగులో ఉన్న వరి పంట పొలాలు

అనంతగిరి: మన్యంలోని ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో సాగునీటి వినియోగం సమతౌల్యంలో ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు నీరు ఎక్కువైనా, ఎద్దడి తలెత్తినా దిగుబడిపైనా భూసారంపై ప్రభావం చూపుతుందంటున్నారు. నీరు, భూమికి ఉండే సహజ లక్షణాలను గుర్తించి ఏ భూమిలో ఏనీటితో పంటలను పండించాలననే అవగాహన రైతులు ఉండాలని సూచిస్తున్నారు.

నీటి వినియోగం ఇలా ఉండాలి

ఎకరా వరిపంటకు 1,250 మిల్లీ లీటర్లు నీరు అవసరం ఉంటుందని అంచనా. పై భాగాన ఉండే రైతులకు అవగాహన లోపంతో ఎక్కువ నీటిని వినియోగిస్తారు. దీని వల్ల 20శాతం పల్లపు ప్రాంత రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. సాగు దశలో సకాలంలోని నీరు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. పైరుకు తడి 75శాతం వరకు తగ్గిపోతే నీటి ఎద్దడి ఉన్నట్లే లెక్క. పంటకు అవసరం లేకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణవాయువు దక్కన్నప్పుడు నీరు పలచగానూ, మొన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యేవరకు 2 సెంటీ మీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెంటీమీటర్ల నీరు ఉండాలి. ఈనిక, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిల్లోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు వహించాలి. కోతకు పది రోజుల ముందు నీటిని నెమ్మదిగా తగ్గించాలి..

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షకాలం కావడంతో రైతులు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చు. నీరు ఎక్కువైతే తెగులు, పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. పిలకలు పెట్టే సామర్థ్యం తగ్గుతుంది. నీరు ఎక్కువగా ఉంటే చెను పెరగదు. నీరు తక్కువగా ఉండే ప్రదేశంలోని ఆరుతడి పంటలను సాగు చేయడం మంచిది. పంట పొలాల్లో సాగు నీరు కావాల్సినంత ఉండే విధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. – ఉమామహేశ్వరీ, ఏవో, అనంతగిరి